నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 29 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎస్పీని కలిసిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 28 : జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో కొత్తగా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన డీ.వీ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం శాంతి భద్రతలపై చర్చించారు. ఇక్కడ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ ఆహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తులం బంగారం ఇంకెప్పుడు?

వాంకిడి, జూన్ 28 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మి ద్వారా ఆర్థికసాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట మార్చిందని, ఇంకెప్పుడు ఇస్తారో చెప్పాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 76 మంది లబ్ధిదారులకు ఎంపీపీ ముండే విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ జబోరే వెంటయ్య మాజీ సర్పంచ్ బండే తూకారాం, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్‌తో కలసి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికసాయమందించేందుకు ఈ ప్రతిష్టాత్మక పథకం తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గుట్కా.. గుట్టుగా

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జోరుగా దందా
- మహారాష్ట్ర నుంచి రైళ్లు, వాహనాల్లో దిగుమతి
- కాగజ్‌నగర్ కేంద్రంగా వ్యాపారం
- తినుబండారాలు అమ్ముతున్నట్లు.. పల్లెలకు సరఫరా
- ఇటీవల జిల్లా కేంద్రంలో పట్టుబడ్డ నిల్వలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గుట్కా దందా జోరుగా సాగుతున్నది. కొందరు వ్యాపారులు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడికి తీసుకొచ్చి సొమ్ము చేసుకోవడం చర్చనీయాంశమవుతున్నది. రహస్య ప్రదేశాల్లోని గోదాముల్లో నిల్వ చేసి.. ఆపై పట్టణాలు, పల్లెలకు తరలిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ బ్రేక్ పడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు స్వాధీనం చేస్తున్న గుట్కా నిల్వ పరిశీలిస్తున్న ఎస్పీ డీ.వీ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్ కేంద్రంగా దందా..

మహారాష్ట్ర నుంచి రైళ్లు, ఇతర వాహనాల్లో గుట్కాతో పాటు దేశీదారును జిల్లాకు తీసుకొస్తున్నారు. కాగజ్‌నగర్‌ను అడ్డాగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా గుట్కాలు సరఫరా చేస్తున్నారు. కొంత మంది వ్యా పారులు కేవలం ఈ దందానే తమ వృత్తిగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా చిరు వ్యాపారులు, కిరా ణా దుకాణాలకు చేరవేస్తున్నారు. మండలాల వారీగా దళారులను ఏర్పాటు చేసుకొని ఈ వ్యాపారం సాగిస్తున్నారు. ఎవరికీ అనుమా నం రాకుండా తినుబండారాలు అమ్ముతున్నట్లుగానే మోటారు సైకిళ్లు, చిన్న చిన్న గూడ్స్ వాహనాల్లో అంబార్, అనార్, ఖైనీ, కర్రపం టి మత్తు పదార్థాలను పల్లెలకు చేరవేస్తున్నా రు. మారుమూల ప్రాంతాల్లోని చిన్న చిన్న దు కాణాల్లో సైతం గుట్కా విచ్చలవిడిగా లభిస్తుందంటే దందా ఏ మేరకు సాగుతున్నదో అర్థమవుతున్నది.

రూ. 8 లక్షల విలువైన గుట్కా పట్టివేత

ఇటీవల జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్‌చెక్‌పోస్టు సమీపంలోగల గోదాంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీచేయగా పెద్ద ఎత్తున దాచి ఉంచిన గుట్కా నిల్వలు బయటపడ్డాయి. సుమారు రూ. 8 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను పట్టుకున్నారు. అలాగే వాంకిడిలో రూ. 12 వేల విలువగల, పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ, మొట్లగూడలో రూ. 4500 విలువగల, కాగజ్‌నగర్‌లోని ఓ గోదాములో రూ. 2.56 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఇక్కడికి వచ్చిన ఓ వ్యాపారి గుట్టు చప్పుడు కాకుండా ఈ దందా నిర్వహించడం చర్చనీయాంశమైంది.

తనిఖీలు నామమాత్రం..

జిల్లాలోకి మత్తు పదార్థాలు రవాణా కాకుండా టాస్స్‌ఫోర్స్ పోలీసులు గట్టినిఘా ఏర్పాటు చేసినప్పటికీ దందా ఆగడం లేదు. వాంకిడి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. బార్డర్‌లో ఉన్న వెంకటాపూర్ వద్ద చెక్‌పోస్టు లేకపోవడంతో వ్యాపారులకు కలిసి వస్తున్నది. ఈ మార్గం గుండా రాత్రి వేళల్లో గుట్కా తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. అధికారులకు కచ్చితమైన సమాచారం ఉంటే తప్ప తనిఖీలు నిర్వహించకపోవడంతోనే యథేచ్ఛగా దందా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

పట్టణ ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో ఎండిపోయిన మొక్కలు

హరితహారంపై నిర్లక్ష్యం!

కాంగ్రెస్ సర్కారు పట్టింపులేనితనంతో ఎక్కడికక్కడ ఎండిపోయిన మొక్కలు

- నిర్వహణ లేక కళావిహీనంగా మారిన పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కులు
- వానలు పడుతున్నా ప్రారంభంకాని వనమహోత్సవం

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ) జూన్ 28 : 'తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పరాయి పాలనలో నిర్జీవంగా మారిన అడవులకు పునరుజ్జీవం పోయాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..' అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. నాడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చదనంతో కళకళలాడిన హరితహారం మొక్కలు.. నేడు కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో ఎండిపోయాయి. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు కూడా ఎండిపోయి కళావిహీనంగా మారాయి. అవెన్యూ ప్లాంటేషన్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు సైతం చాలా చోట్ల చనిపోయాయి. ఒకప్పుడు పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపాలిటీ, ఫారెస్టు శాఖల అధికారులు పట్టించుకోలేదు. కొత్త మొక్కలు నాటకపోగా.. ఉన్నవాటిని కూడా కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

ప్రారంభంకాని వనమహోత్సవం

కేసీఆర్ హయాంలో తొలకరి జల్లులు (జూన్‌లో) పడగానే పట్టణాలు, పల్లెల్లో మొక్కలు నాటేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వానలు పడుతున్నా వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించ లేదు. జూలై నుంచి మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో హరితహారం కింద గతంలో నాటిన మొక్కల ఆలనాపాలనా చూస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు చాలా చోట్ల ఎండిపోగా, వాటి స్థానంలో కొత్తవి నాటుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఆసిఫాబాద్ జిల్లాలో 54 లక్షలు, మంచిర్యాల జిల్లాలో 31.20 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మంచిర్యాల జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 20 లక్షల మొక్కలు నాటనున్నారు. మిగిలినవి ఫారెస్టు, ఇతర డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో నాటనున్నారు. ఈ మేరకు జీపీల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంచిర్యాల పట్టణం గ్రీన్ సిటీలో ఎండిపోయిన హరితహారం మొక్కలు

నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

పదో విడుత ప్రణాళికలేవీ?

నిర్మల్ అర్బన్, జూన్ 28 : నిర్మల్ జిల్లాలోని 396 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో డీఆర్డీఏ శాఖ ఆధ్వర్యంలో 51.48 లక్షల మొక్కల పెంపకం చేపట్టగా, నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. దా దాపు 70-80 రకాల మొక్కలను సిద్ధం చేశారు. పదో విడుత హరితహారంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 30.87 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యం నిర్దేశించారు. కానీ ఇప్పటివరకు ప్రణాళికలు రూపొందించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో తొలకరి జల్లులు కురవగానే పట్టణాలు, పల్లెల్లో మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేసేవారు.

జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి
- మంచిర్యాలలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

మంచిర్యాలటౌన్, జూన్ 28: బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని మంచిర్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని గ్రీన్‌సిటీలోగల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్ రైస్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. డీఎఫ్‌వో శివ ఆశిష్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందని, మన క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. మాజీ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ తనకు క్రీడలంటే ఎంతో ఇష్టమని, తాను స్వయంగా క్రీడాకారుడినేనని అన్నారు. మంచిర్యాలలో నిర్వహించే టోర్నమెంట్‌లకు తనవంతు సహకారమందిస్తానని అన్నారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ మంచిర్యాలలో క్రీడలు నిర్వహించే వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల పట్టణంలో అన్ని క్రీడలకు ఉపయోగపడేలా పెద్ద స్టేడియాన్ని నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం జాయింట్ సెక్రటరీ బాబు మాట్లాడుతూ మంచిర్యాలలో యేటా బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలను నిర్వహిస్తున్నారని, ఇది అభినందించదగ్గ విషయమన్నారు. టోర్నమెంట్ కన్వీనర్ గాజుల ముఖేశ్ గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల వాసు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరు సుధాకర్. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్, డీవైఎస్‌వో రాజు వీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదర్ తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మీనా రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, హర్ష, రాజలింగు, కృష్ణ, టోర్నమెంట్ రిఫరీ మల్లికార్జున్, టెక్నికల్ కమిటీ చైర్మన్ టీసీఎస్ రావు, జాయింట్ సెక్రటరీ మనోజ్, రిఫరీ మల్లికార్జున్, మ్యాచ్ కంట్రోల్ కుమార్, ఎంపైర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో క్రీడాకారులతో జడ్పీ చైర్‌పర్సన్, డీఎఫ్‌వో, సభ్యులు

మహిళలను గౌరవించాలి

- అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు
- రామగుండం సీపీ శ్రీనివాస్
- ఈవ్ టీజర్స్‌కు నిపుణులతో కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, జూన్ 28 : మహిళలు, విద్యార్థినులను గౌరవించాలని, వారితో అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడ్డ 42 మంది ఈవ్‌టీజర్స్‌కు హైదరాబాద్‌కు చెందిన మహిళా భద్రతా విభాగం నిపుణుల ద్వారా జూమ్ మీటింగ్ నిర్వహించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను ఎలా గౌరవించాలి, వారిపట్ల ప్రవర్తించాల్సిన తీరు, వారిని వేధిస్తే ఎలాంటి శిక్షలకు గురవుతారు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ.రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్ధె స్వామి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ రాజమౌళిగౌడ్, పెద్దపల్లి షీ టీమ్ ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవ్ టీజర్స్‌కు నిర్వహించిన అవగాహనలో మాట్లాడుతున్న పోలీసులు

బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి

టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, జూన్ 28 : తెలంగాణలోని బొగ్గు బ్లాకులన్నీ ప్రభుత రంగ సంస్థ అయిన సింగరేణికే నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు చెందిన బొగ్గు బ్లాకులను వేలంలో పెట్టకుండా సింగరేణికే అప్పగించాలని, గతంలో సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లను ప్రైవేట్‌కు అప్పగించినా పనులు చేపట్టనీయలేదని, ఇప్పుడు శ్రావణపల్లి బ్లాక్‌ను స్వయంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దగ్గరుండి ప్రైవేట్ వారికి అప్పగించేందుకు సహకరించడం శోచనీయమన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వంత పాడుతున్నదన్నారు. జూలైలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని, 1న సింగరేణి గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని, 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేస్తామని, 6న జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. 9న గోదావరిఖని కేంద్రంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని, ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని, అన్ని వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు మంగీలాల్, ఓరం కిరణ్, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, రాజేశం, దేవేందర్, కైత స్వామి, రమేశ్, దుంపల బాపు, సంజీవ్, చందర్, మారుతి ఉన్నారు.

గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో నినాదాలు చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

'పది' సప్లిమెంటరీ ఫలితాల్లో 75.39 శాతం ఉత్తీర్ణత

నస్పూర్, జూన్ 28 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో 75.39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 841 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 634 మంది ఉత్తీర్ణులైనట్లు ఆయన పేర్కొన్నారు. బాలురు 502 మంది పరీక్ష రాయగా, 375 మంది, బాలికలు 339 మంది పరీక్ష రాయగా, 259 మంది పాస్ అయినట్లు తెలిపారు.

ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న జిల్లా మైనింగ్ ఏడీ

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

- జిల్లా మైనింగ్ ఏడీ గంగాధర్
- పెంచికల్‌పేట్‌లో దాడులు
- 235 ట్రిప్పుల ఇసుక స్వాధీనం

పెంచికల్‌పేట్, జూన్ 28 : అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ ఏడీ గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డితో కలిసి ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. అనుమతుల్లేని 235 ట్రిప్పుల ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 3 లక్షల 29 వేలు ఉంటుందన్నారు. వారంలోగా నిల్వలకు సరిపడా డబ్బులు చెల్లించి రసీదులు అందజేస్తే వారికి వినియోగించుకోవడానికి అవకాశం ఇస్తామని, లేదంటే వేలం వేస్తామని తెలిపారు. బ్రిక్స్ ఇండస్ట్రీల వారు రూ. 1400 డీడీ తీసుకొని ఇసుకను వాడుకోవాలని తెలిపారు. అనుమతుల్లేకుండా తరలించే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాల్ ఉన్నారు.